క్లుప్తంగా

ఆశావర్కర్లకు శిక్షణ

బూర్గంపాడు: అసంక్రమిత వ్యాధులపై ఆశావర్కర్లకు మోరంపల్లిబంజర పీహెచ్‌సీలో శనివారం శిక్షణనిచ్చారు.అసంక్రమిత వ్యాధులైన బీపీ, షుగర్, కేన్సర్ వ్యాధులపై మూడు రోజుల పాటు శిక్షణనిస్తున్నట్లు వైద్యాధికారి స్పందన తెలిపారు. గుండెపోటు వచ్చిన సమయంలో సీపీఆర్ చేయటంపై కూడా ఆశావర్కర్లకు శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో ట్రైనర్లు కాంతమ్మ, సద్గుణవాణి, సీహెచ్‌ఓ సోమ్లా, హెచ్‌ఈఓ రవి,హెచ్‌వీ సడాలదేవి,భవాని తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం

దమ్మపేట: ఫోర్త్ అండర్ ఆర్మ్ క్రికెట్, అండర్-19 విభాగంలో అత్యుత్తమ ప్రతిభ చూపిన దమ్మపేట గురుకుల కళాశాల ఇంటర్మీడియట్ విద్యార్థి కేతావత్ బాబును జిల్లా రీజినల్ కో-ఆర్డినేటర్ సీహెచ్.డేవిడ్‌రాజు సన్మానించారు. ఫిబ్రవరి 21 నుంచి 24వ తేదీ వరకూ నేపాల్‌లో జరిగిన ఇండోనేపాల్ ఇంటర్నేషనల్ కప్-2023లో ఇండియా తరుపున వైస్‌కెప్టెన్‌గా పాల్గొన్న కేతావత్ బాబు చక్కటి ప్రతిభ చూపి, మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అందుకున్నాడు. కాగా శనివారం కళాశాలను సందర్శించిన రీజినల్ కో-ఆర్డినేటర్ డేవిడ్‌రాజు విద్యార్థి బాబును దుశ్శాలువతో సత్కరించారు. గురుకులం నుంచి విద్యార్థికి అన్నివిధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నూతకాని శ్యామ్‌కుమార్, వైస్‌ప్రిన్సిపాల్ పీఎస్. కమలాకర్,సీనియర్ ఫిజిక్స్ అధ్యాపకుడు సీహెచ్. ఫణికుమార్, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

అభివృద్ధి సాధించాలి

అశ్వాపురం: మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని చైల్డ్ డవలప్‌మెంట్ ఇన్‌చార్జ్ ఆఫీసర్ సీత అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని గొందిగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు గృహహింసకు గురికుండా తమ హక్కులు పొందాలన్నారు. మహిళల కోసం 181 నంబర్ అందుబాటులో ఉంటుందన్నారు. బాల్యవివాహాలు, లైంగిక వేధింపులకు గురైన వారిని, అపదలో ఉన్న వారిని సంరక్షించేందుకు 1098కు కాని 100కు కాని సమాచారం అందించాలన్నారు. గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సక్కుబాయి, ఐసీపీఎస్ ఫీల్డ్ వర్కర్ లత, చైల్డ్‌లైన్ 1098 బృందం సభ్యురాలు లలిత, పోషన్ అభియాన్ శంకర్, అంగన్‌వాడీ టీచర్లు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సిద్ధమవుతున్న గోటి తలంబ్రాలు

అశ్వాపురం: మండల కేంద్రంలో రామాంజనేయ ఆలయంలో మహిళా భక్తులు భక్తి శ్రద్ధలతో గోటితో తంబ్రాలను సిద్ధం చేస్తున్నారు. వీటిని ఈ నెల 6న శ్రీరామనవమి సందర్భంగా మహిళా భక్తులు కాలినడకన భద్రాచలం వెళ్లి రామాలయ కమిటీ వారికి తంబ్రాలు అందజేయనున్నారు. సీతారామ కల్యాణ మహోత్సవంలో వాటిని వినియోగించనున్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, భక్తులు యార్లగడ్డ సింధు, దొడ్డ నారాయణమ్మ, సుందరమ్మ, ఉడతనేని సంధ్య, యలమద్ది లక్ష్మి, బోడపాటి విజయ, కవిత, దివ్య, పావని, శ్రీలత, సత్యవతి, అనిత, ప్రమీల, సాయిశ్రీ, ఉమారాణి, సవత, హైమావతి, లక్ష్మి, భక్తులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

మణుగూరుటౌన్: కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం డీఎస్సీ 2003 టీచర్లకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని టీఎస్ యూటీఎఫ్ మణుగూరు మండల అధ్యక్ష కార్యదర్శులు షేక్ మీరాహుస్సైన్, కారం సీతారామయ్యలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆసంఘం సమావేశంలో వారు పాల్గొని ప్రసంగించారు. ఉపాధ్యాయ సమస్యలపై చర్చించారు. ఐటీడీఏలోను ప్రమోషన్లు, ట్రాన్స్‌ఫర్లు నిర్వహించాలని, అందుకోసం వెంటనే షెడ్యూల్ విడుదల చేయాలని అన్నారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ మండల కోశాధికారి మేరెడ్డి ఇంద్రసేనారెడ్డి, సంఘం సభ్యులు సీహెచ్ శ్రీనివాసరావు, విజయలక్ష్మి, స్వామి, నరేష్, వెంకన్న, తేజావత్ కృష్ణమూర్తిలు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

చర్ల: సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా ధర్మారం గ్రామంలో ఆదివాసీలకు సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా ఆదివాసీలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. సీఆర్‌పీఎఫ్ 151 బెటాలియన్, కోబ్రా 204 బెటాలియన్ కంపెనీల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామంలోని 70 కుటుంబాల వారికి నిత్యావసర వస్తువులతో పాటు దుస్తులు, నోట్ పుస్తకాలు, స్టేషనరీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ 151 బెటాలియన్ సెకెండ్ ఇన్ కమాండెంట్ విష్ణు చరణ్, డిప్యూటీ కమాండెంట్స్ అమిత్ పాల్, రంజన్ ప్రకాష్, దీపాంకర్‌నగర్, యశ్వీర్‌సింగ్ కోబ్రా 204 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ సందీప్ వాంకర్ మాట్లాడారు. సీఆర్‌పీఎఫ్, కోబ్రా విభాగాలకు చెందిన అధికారులు, జవాన్లు పాల్గొన్నారు.

బతుకుదెరువుకు వలసబాట

- కుటుంబాలతో భద్రాచలం, సారపాక రాక..
- వ్యవసాయ పనిముట్ల తయారీతో జీవనం
- ఏడాదికి ఆరు నెలలు ఇతర ప్రాంతాల్లోనే..
- మధ్యప్రదేశ్ వాసుల జీవన శైలి ఇది..

సండే స్పెషల్



తయారు చేసిన వ్యవసాయ పనిముట్లు



పనిముట్లు తయారు చేస్తున్న మధ్యప్రదేశ్ వాసులు

ఆధునిక కాలంలోనూ వారు చేతివృత్తులే జీవనాధారంగా బతుకుతున్నారు. స్థానికంగా ఉపాధి లేక పొట్టచేతబట్టుకుని వందల మైళ్లు వలసబాట పట్టారు. ఇనుము కరిగించి.. చెమట చిందించి వ్యవసాయ పనిముట్లను తయారు చేసి అమ్ముతూ పొట్ట పోసుకుంటున్నారు. మధ్యప్రదేశ్ నుంచి వలసవచ్చిన కొన్ని కుటుంబాల జీవన విధానమిది..

భద్రాచలంఅర్బన్: మధ్యప్రదేశ్ నుంచి పదుల సంఖ్యలో కుటుంబాలు భద్రాచలం, సారపాక పట్టణ పరిసరాలకు వలసవచ్చాయి. ఇనుమును కొలిమిలో కరిగించి వ్యవసాయ పనిముట్ల తయారీ చేసి విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. 20 రోజుల క్రితం వారు భద్రాచలం, సారపాక సమీపంలో రోడ్డు పక్కనున్న ఖాళీ స్థలంలో పట్టాలతో గుడారాలు వేసుకున్నారు. పనిలో భాగంగా తెల్లవారక ముందు నుంచే ఇనుము కరిగించే పనుల్లో నిమగ్నమవుతారు. లారీ, ట్రాక్టర్లు, ఇతర వాహనాలకు చెందిన పనికిరాని ఇనుప పట్టాలను కిలోల ప్రకారం కొనుగోలు చేసి వాటిని కొలిమిలో కరిగిస్తారు. ఆపై కోత చేసే కొడవళ్లు, గొడ్డళ్లు, వ్యవసాయ పరికరాలు పారలు, గుణపాలు, వంటకు సంబంధించిన కత్తిపీటలు, మాంసం కత్తులు తయారు చేస్తున్నారు. ప్రస్తుతానికి తయారు చేసిన కొడవలిని రూ.100-150 వరకు అమ్ముతున్నారు, గొడ్డళ్లు రూ.400-450లు, మాంసం కత్తి రూ.150-రూ.250కు అమ్ముతున్నారు.

ఫలించని జీవన పోరాటం

పరికరాలు చేయడం కన్నా వాటిని విక్రయించడానికి వీరు అధికంగా శ్రమిస్తున్నారు. ఒక్కో రోజు ఒక్క పనిముట్టు కూడా అమ్ముడుపోకపోవడం ఇందుకు నిదర్శనం. దీంతో వారిలోని కొందరు పనిముట్లను తీసుకుని విక్రయించడానికి పట్టణంతో పాటు గ్రామాలకు వెళ్తున్నారు. అయినప్పటికీ ఒక్కరోజులో ఒక్కొక్కరికి రూ.400 నుంచి రూ.500 కూలి కూడా లభించడం లేదని వారు చెబుతున్నారు. తమ ప్రాంతంలో పరికరాలకు అంతగా గిరాకీ లేదని ఇంత దూరం వలస వచ్చినా.. ఆశించిన ఫలితం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు.. ఇలా వలస వచ్చే క్రమంలో తమ పిల్లలు విద్యకు దూరమవుతున్నారని బాధిస్తున్నా.. ముందు తాము కడుపు నింపుకోగలిగితే చాలనే భావనలో ఉన్నారు. వచ్చే ఏడాది నుంచి ఇదే సమయంలో ఇక్కడి వస్తామని, ఇక్కడ వ్యవసాయ పనులు పూర్తయిన తరువాత తమ ప్రాంతానికి వెళ్లిపోతామని అంటున్నారు.

పూట గడవటం కష్టం



వ్యవసాయ పనిముట్లు తయారీ పని చిన్నప్పటి నుంచి చేస్తున్నా. మా ప్రాంతంలో పనిముట్లు కష్టపడి తయారుచేసినా సరైన గిరాకీ ఉండదు. అందుకే బతుకుదెరువు కోసం ఇలా వలస వస్తున్నాం. పిల్లాపాపలతో సహా కుటుంబం అంతా ఇక్కడకు వస్తాం. అయితే, రోజంతా శ్రమించినా కష్టానికి తగ్గ ఫలితం అందడం లేదు. అయినా తప్పడం లేదు.

– జితేన్, మధ్యప్రదేశ్

ఇదే మా జీవనాధారం



వలస వచ్చి వ్యవసాయ పనిముట్లు తయారు చేస్తాం. పూర్వీకుల నుంచి ఇదే వృత్తిపై ఆధారపడుతున్నాం. వ్యవసాయ సీజన్‌లో వచ్చి వ్యవసాయ పనిముట్లు తయారు చేసి అమ్ముతాం. రెక్కలు ముక్కలయ్యేలా.. ఎండనకా, పగలనక తయారుచేసినా విక్రయించేందుకు మరింత శ్రమించాల్సి వస్తోంది. అరకొరగా వచ్చే సొమ్ముతోనే మా ఊరికి వెళ్లాల్సి ఉంటుంది.

– గీతాబాబు, మధ్యప్రదేశ్

కళాశాలలో న్యాయచైతన్య సదస్సు



మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ వెంకటేశ్వర్లు

మణుగూరురూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మణుగూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం న్యాయచైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు మణుగూరు ఫస్ట్‌క్లాస్ జ్యుడిషియల్ కోర్ట్ మెజిస్ట్రేట్ వెంకటేశ్వర్లు, డీఎస్పీ రాఘవేంద్రరావులు ముఖ్య అతిథులుగా హాజరై చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు న్యాయపరమైన సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో మణుగూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్, కళాశాల ప్రిన్సిపల్ బి.శ్రీనివాస్, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ కవిత, వాసవి, పోశం భాస్కర్, బిక్కసాని శ్రీనివాస్, సర్వేశ్వరరావు, అశ్వాపురం సీఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి

అశ్వాపురం: దొంగతనాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మణుగూరు డీఎస్పీ రాఘవేందర్‌రావు అన్నారు. మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామంలో ఇటీవల తరచూ దొంగతనాలు జరుగుతూ ప్రజలు భయాందోళన చెందుతుండటంతో అశ్వాపురం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు మణుగూరు డీఎస్పీ రాఘవేందర్‌రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామాల్లో దొంగతనాలు అరికట్టేందుకు ప్రజలు చైతన్యం కావాలని, జాగ్రత్తలు పాటించాలన్నారు. గ్రామాల్లో ఊరు చివర ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్నారన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు, గ్రామపెద్దలు, ముందుకు రావాలని సూచించారు. కొత్త వ్యక్తుల సంచారంపై జాగ్రత్తగా ఉండాలని, పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. కార్యక్రమంలో సీఐ చెన్నూరి శ్రీనివాసరావు, ఎస్సై జితేందర్, ఉపసర్పంచ్ చావా వీరరాఘవులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ రాఘవేందర్‌రావు

కొత్తపల్లిలో ఉచిత వైద్య శిబిరం

దుమ్ముగూడెం: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఉదయ్ హస్పిటల్స్ భద్రాచలం ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ గుండి వెంకటేశ్వర్లు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. శిబిరంలో అన్ని రకాల టెస్టులు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఈటె ఉదయ్ మాట్లాడుతూ.. గ్రామీణ ఏజెన్సీ ఏరియాలో ప్రజలు రోగాలపై సరైన అవగాహన చైతన్యం, లేక పోవడంతో చిన్నచిన్న రోగమే కదా అని నిర్లక్ష్యంగా వైద్యులను సంప్రదించకుండా మూఢ నమ్మకాలతో సొంత వైద్యంపై ఆధారపడటంతో మృత్యువాత పడుతున్నారని అన్నారు. ప్రజలు అనారోగ్యానికి గురైతే వెంటనే దగ్గర్లోని వైద్యశాలను సంప్రదించి పరీక్షలను నిర్వహించుకుని మందులను వాడాలని సూచించారు. గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి టెస్టులు చేసి ఉచితంగా మందులను అందించడంపై సర్పంచ్ హాస్పిటల్ యజమాన్యానికి కృతజ్ఞతలు తెలియచేశారు. ఎంపీటీసీ పూసం ధర్మరాజు, కొర్సా రామచంద్రయ్య, వీరభద్రం, కల్లూరి ప్రసాద్, ఇర్ప వీర్రాజు, కణితి ముత్తయ్య, ఇర్ప ముద్దరాజు, కొర్సవీరభద్రం పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం



మణుగూరుటౌన్: సింగరేణి ఆధ్వర్యంలో క్రీడా పోటీల్లో పాల్గొన్న మహిళలు

చండ్రుగొండ: మండలకేంద్రం చండ్రుగొండలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రపంచ మహిళా దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. రైతువేదికలో జరిగిన ఈ కార్యక్రమంలో సీడీపీఓ నిర్మలాజ్యోతి మాట్లాడుతూ.. లింగవివక్షత నిర్మూలన, బాల్యవివాహాలు అరికట్టడం, గృహహింస నిర్మూలన్నారు. ఎంపీపీ బాణోత్ పార్వతి, సీడీపీఓ నిర్మలాజ్యోతి, ఎంపీడీఓ అన్నపూర్ణ, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ కాంతకుమారి, ఎంపీటీసీ లంకా విజయలక్ష్మి, సఖీకేంద్రం బాధ్యులు జే.సుబాసీ, యం.సునిత, బి.వసంతలను సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీ కోప్షన్ సభ్యుడు ఎస్‌డీ రసూల్, ఐసీపీఎస్ ఆఫీసర్ వినోద్‌కుమార్, ఉపసర్పంచ్ బాబురావు, సూపర్‌వైజర్లు శకుంతల, రాణి, గంగాజలం, టీచర్లు అరుణ, లక్ష్మి, సుజాత, నాగమణి పాల్గొన్నారు.

క్రీడా పోటీలు..

మణుగూరుటౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మణుగూరు ఏరియాలోని మహిళలకు స్థానిక భద్రాద్రి స్టేడియంలో క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఏరియా డీజీఎం పర్సనల్ ఎస్.రమేష్, గుర్తింపు సంఘం నాయకుడు వి.ప్రభాకర్‌రావులు ప్రారంభించి ప్రసంగించారు. పోటీల్లో విజేతలైనవారికి మార్చి 8న జరిగే మహిళా దినోత్సవ వేడుకల్లో బహుమతులు అందజేస్తామన్నారు. అనంతరం క్రీడాకారులకు వివిధ రకాల క్రీడా పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ పర్సనల్ అధికారి సింగు శ్రీనివాస్, స్పోర్ట్సు సూపర్‌వైజర్ జాన్‌వెస్లీ, టీబీజీకెఎస్ నాయకులు వీరభద్రం, సేవా సెక్రటరీ షకీరా, స్పోర్ట్సు కోఆర్డినేటర్ సురేష్‌లు పాల్గొన్నారు.

8న దుకాణాల వేలం

భద్రాచలం: భద్రాచలం ఆర్‌టీసీ ఇన్‌గేట్ వద్ద నున్న కనకదుర్గ అమ్మవారి దేవస్థానం దుకాణాల లీజుకు ఈ నెల 8వ తేదీన వేలం పాటలను నిర్వహించనున్నట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి సుదర్శన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నిమ్మకాయలు అమ్ముకోడానికి, దేవస్థానం ఆవరణలో కొబ్బరికాయలు, పూజా సామగ్రి తదితర విక్రయాలకు, పూలు, పూల దండలు విక్రయించుకోడానికి దుకాణాల కోసం వేలంలో పాల్గొనేందుకు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు బుధవారం ఉదయం 10 గంటలకు దేవస్థానం వద్ద హాజరు కావాలని కోరారు.

మల్టీగ్రెయిన్ మీల్ పంపిణీ

మణుగూరురూరల్: మండల పరిధిలోని వడ్డెరబజార్, కొండాపురం అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఐటీడీఏ భద్రాచలం ద్వారా పౌష్టికాహారమైన మల్టీగ్రెయిన్ మీల్ పంపిణీ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఈ పౌష్టికాహారాన్ని ప్రతీ బుధ, శనివారాల్లో గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు అందించనున్నారు. సరస్వతి, అంగన్‌వాడీ టీచర్ కుమారి, హెల్త్ సూపర్‌వైజర్ దయామని, రాంప్రసాద్, ప్రభావతి, నాగజ్యోతి, జ్యోతి, కృష్ణవేణి, శారద పాల్గొన్నారు.

నేటి నుంచి కల్యాణ మహోత్సవాలు

అశ్వాపురం: మండల పరిధిలోని సండ్రలబోడు గ్రామంలో బండ్లసిరిగుట్ట స్వయంభు శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు నేటి నుంచి ఘనంగా నిర్వహించనున్నారు. నేడు స్వామి వారికి ప్రత్యేక భజనలు, గ్రామ దేవతలకు ఆహ్వానం, ఈ నెల 6న శ్రీ విష్ణు సహస్ర నామాలు, గోవింద నామాలు, స్వామి వారి ఊరేగింపు, స్వామి వారికి పుణ్యస్నానాలు, ఎదుర్కోలు ఏర్పాటు చేశారు. 7న భగవద్గీత హోమం, స్వామి వార్లకు పట్టువస్త్రాలు సమర్పణతోపాటు స్వామి వారి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. కల్యాణ మహోత్సవాలకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. నూతన ఆలయ నిర్మాణానికి భక్తులు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని ఆలయకమిటీ వారు కోరుతున్నారు.

విగ్రహ ప్రతిష్ఠకు ఆహ్వానం

అశ్వాపురం: ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావును మణుగూరులో క్యాంపు కార్యాలయంలో మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామస్తులు కలిశారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఈ నెల 22వ తేదీ నుంచి 24వ తేదీ వరకు జరగనున్న బొడ్రాయి, ముత్యకేశ్వరి, ముత్యాలమ్మతల్లి, పోతురాజుల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి హాజరు కావాలని నిర్వహణ కమిటీ బాధ్యులు, ఎస్సీ కాలనీ గ్రామస్తులు ఎమ్మెల్యేను ఆహ్వానించారు.

ఆర్థిక సాయం అందజేత

అశ్వాపురం: మండల పరిధిలోని అమెర్డ కాలనీ గ్రామానికి చెందిన నజీర్‌షాను అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థికంగా ఇబ్బంది పడుతుండటంతో ముస్లిం మైనార్టీ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ సంక్షేమ సమితి నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలన

మణుగూరుటౌన్: మణుగూరు మండలంలోని పలు అభివృద్ధి పనులను శనివారం తెలంగాణ ప్రభుత్వ విప్ పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు పరిశీలించారు. మణుగూరు మండలంలోని మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.29 లక్షల 44వేల ఖర్చుతో జరుగుతున్న అభివృద్ధి పనులు పరిశీలించారు. పాఠశాలలో జరుగుతున్న పనుల పురోగతి గురించి తెలుసుకున్నారు. అక్కడ చదువుతున్న 10వ తరగతి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. రాజీవ్‌గాంధీ నగర్‌లో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్ సముదాయ నిర్మాణ పనులు పరిశీలించారు. రూ.4కోట్ల 50లక్షల వ్యయంతో నిర్మిస్తున్న ఆ మార్కెట్ పనులు వివరాలను తెలుసుకున్నారు. నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తిచేయాలని అధికారులకు ఆదేశించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో మణుగూరు మండల విద్యాశాఖ అధికారి వీరస్వామి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పటేల్ లక్ష్మీనారాయణ, ఇతర ఉపాధ్యాయులు టీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కు అందజేత..

మణుగూరురూరల్: మణుగూరు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో తహసీల్దార్ కె.నాగరాజు ఆధ్వర్యంలో 46 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కింది మంజూరైన చెక్కులను ముఖ్య అతిథిగా హాజరైన పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బచ్చల భారతి, బొగ్గం రజిత, కొమరం జంపేశ్వరి, ఎంపీటీసీలు గుడిపూడి కోటేశ్వరరావు, రమ్య, కణితి బాబురావు, మండల కో ఆప్షన్ సభ్యుడు జావిద్‌పాషా, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు..

మణుగూరు మున్సిపాలిటీ పరిధి బాపనకుంట ఏరియాకు చెందిన ఆర్ పుష్పాంజలికి ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరైన రూ.13,500ల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కును పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు శనివారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మణుగూరుటౌన్: మార్కెట్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రేగా

బీమా చెక్కు..

స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఇటీవల ప్రమాదవశాత్తు మరణించిన కమలాపురానికి చెందిన చిన్ని వెంకటేశ్వర్లు, బూర్గంపాడు మండలం సోంపల్లికి చెందిన ధనుసూరి పుల్లయ్యల కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి రూ.2లక్షల చొప్పున ఎమ్మెల్యే రేగా కాంతారావు చేతుల మీదుగా బీమా చెక్కులను పంపిణీ చేశారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకే సైన్స్ ఫెయిర్

విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు సైన్స్ ఫెయిర్ కార్యక్రమాలు దోహదపడతాయని పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. శనివారం మణుగూరులోని పైలట్‌కాలనీలోని ఎక్స్‌లెంట్ పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థులు తయారు చేసి ప్రదర్శించిన నమూనాలను తిలకించారు. ఎక్స్‌లెంట్ విద్యాసంస్థల చైర్మన్ యూసఫ్, డైరెక్టర్లు ఖాదర్, యాకుబ్, ఖాన్, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి



ఓ ప్రైవేట్ ఆస్పత్రిలోని స్కానింగ్ సెంటర్‌లో తనిఖీ చేస్తున్న అధికార బృందం

భద్రాచలం: ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యశాల్లో స్కానింగ్ సెంటర్‌లు ప్రభుత్వ నియమనిబంధనల ప్రకారం నిర్వహించాలని, లేదంటే చట్టపరమైన చర్యలను తీసుకుంటామని డిప్యూటీ డీఈఎంఓ ఫైజ్‌మొయిద్దీన్ అన్నారు. శనివారం ఆయన తన బృందంతో ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, ఆయుషి, జేకే లిస్టర్, జాబిల్లి, సురక్ష, లీలా నర్సింగ్ హోంలలోని స్కానింగ్ సెంటర్‌లలో తనిఖీలు చేసి రికార్డులను పరిశీలించారు. గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలను నిర్వహించవద్దని సూచించారు. అనుమతులు లేకుండా స్కానింగ్ చేసినా, స్కానింగ్ మిషన్‌ను ఇతర ప్రాంతాలకు తరలించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎఫ్ ఫారంను భర్తీ చేసి ఆన్‌లైన్ అనంతరం ప్రతి నెల 5వ తేదీ లోపు జిల్లా కార్యాలయానికి అందచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్ల పంపిణీ

బూర్గంపాడు: యువత క్రీడా నైపుణ్యాలను మెరుగుపరుచుకుని క్రీడలలో రాణించాలని జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత అన్నారు. లక్ష్మీపురం గ్రామంలోని యువ క్రీడాకారులకు రేగా విష్ణు మెమోరియల్ ట్రస్ట్ సహకారంతో ప్రభుత్వ విప్ రేగా కాంతారావు సౌజన్యంతో అందించిన వాలీబాల్ కిట్లను శనివారం ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్రీడలతో శారీరక దారుఢ్యం, మానసిక స్థైర్యం వృద్ధి చెందుతున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాలం దివాకర్‌రెడ్డి, నల్లమోతు సురేష్, ఏసుబు, నాగేశ్వరరావు, దుర్గారావు, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

గుండాల: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ప్రభుత్వం కల్పించే ఉపాధి, ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆళ్లపల్లి ఎంపీపీ కొండ్రు మంజుభార్గవి అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల యువతకు వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ విప్ రేగా కాంతారావు రేగా విష్ణు మెమోరియల్ ట్రస్టు ద్వారా వాలీబాల్ కిట్లను అందిస్తున్నారని తెలిపారు. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కిషోర్‌బాబు, భద్రం, ప్రసాద్, జానీ, రాజేష్, నగేష్, సంతోష్, రవి, రాజు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

ములకలపల్లి: మండలపరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన కస్తూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్స్‌ను పంపిణీ చేశారు. మండలకేంద్రంతోపాటు, జగన్నాథపురం, పూసుగూడెం ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా పాఠశాలల్లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ములకలపల్లి వాసి, కారేపల్లి ఎస్సై పుష్పాల రామారావు చేతుల మీదుగా వీటిని చిన్నారులకు అందజేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ.. తన మిత్రుడు, ఫౌండేషన్ చైర్మన్ చరణ్ సహకారంతో 170 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శనగపాటి మెహరమణి, బీఆర్ఎస్ నాయకులు పువ్వాల మంగపతి, ముకల పెద్దవెంకన్న, పుష్పాల చందర్‌రావు, శనగపాటి సీతారాములు, పుష్పాల సాయి, నందమూరి మురళి, శ్రీను, ములకలపల్లి పీఎస్ హెచ్‌ఎం శంకర్, పూసుగూడెం హెచ్‌ఎం యోగితావేణి, కస్తూర్బా ఎస్ఓ సక్కుభాయి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దాడితో సంబంధం లేదు..

ములకలపల్లి: ఆదివాసీ జేఏసీ నాయకుడు ఊకే ముక్తేశ్వరరావుపై జరిగిన దాడిని ఖండిస్తున్నట్లు పాల్వంచకు చెందిన ఎండీ. షకీల్ అహ్మద్, ఎండీ. షహీజ్ అహ్మద్ తెలిపారు. మండలకేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మండల పరిధిలోని సీతారాంపురం శివారులో తమ పూర్వీకుల నుంచి సంక్రమించిన సుమారు 40 ఎకరాల వ్యవసాయ భూమి ఉందని, ఆ భూమిని ప్రభుత్వ భూమిగా చెప్తూ ఇటీవల కొందరు ఆ ప్రదేశంలో గుడిసెలు నిర్మించారని తెలిపారు. ఈ విషయంలో తాము కోర్టును ఆశ్రయించామన్నారు. ఈ తరుణంలో గురువారం ఆదివాసీ జేఏసీ నాయకుడిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేయగా.. ఆ దాడి తామే చేయించామని కొందరు దుష్ప్రచారానికి పాల్పడుతున్నారని అన్నారు. ఈ ఘటనలో తమకుగానీ తమ కుటుంబీకులకుగానీ ప్రత్యక్షంగాకానీ, పరోక్షంగాకానీ ఎటువంటి సంబంధమూ లేదని స్పష్టం చేశారు.

గ్యాస్ ధరలు తగ్గించాలి

దుమ్ముగూడెం: కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సరియం రాజమ్మ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని కన్నాపురం గ్రామంలో మహిళ సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడారు. ఇనుగుర్తి రాజేశ్వరి, అనుసూయ, నాగమణి,అనురాధ, దేవమణి, తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లి: కేంద్రగ్యాస్‌ధరలు తగ్గించాలిప్రభుత్వం పెంచిన వంటగ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ మండల కార్యదర్శి ఎండి.యూసఫ్ పిలుపునిచ్చారు. పెంచిన ధరలకు నిరసనగా పార్టీ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కొర్రి భద్రం, కో-ఆప్షన్ సభ్యుడు జబ్బార్, మండల కార్యదర్శి నరాటి రమేష్, వార్డు సభ్యుడు పీరూనాయక్, దాసుల పుష్పావతి, పువ్వాల రజని తదితరులు పాల్గొన్నారు.

కరకగూడెం: బీజేపీ అధికారంలోకి వచ్చాక గ్యాస్ ధరలు రోజురోజుకూ పెరుగుతూ మధ్య తరగతిపై గుది బండలా మారిందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రావుల సోమయ్య అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ఆదేశానుసారం శుక్రవారం మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతు సమన్వయ సమితి కమిటీ అధ్యక్షుడు అక్కిరెడ్డి వెంకటరెడ్డి, ఆత్మ కమిటీ డైరెక్టర్ కొంపెల్లి పెదరామలింగం, ఉపాధ్యక్షులు పోగు వెంకటేశ్వర్లు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



దుమ్ముగూడెం: ఐద్వా ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న మహిళలు